క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్

నవాబుపేట: మండలంలోని లోకిరేవు సమీపంలో దుంధుబీ వాగులో నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. మంగళవారం లోకిరేవువాగులో నుంచి మల్లారెడ్డిపల్లికి చెందిన శివ తన ట్రాక్టర్‌లో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా మండల కేంద్రం సమీపంలో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి ట్రాక్టర్ సీజ్ చేసినట్లు చెప్పారు.

పేదలకు అన్నదానం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎల్లమ్మ గుడి సమీపంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదిన సందర్భంగా అన్నదానం చేసినట్లు మహబూబ్‌నగర్ అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సుదర్శన్, బుచ్చిబాబు, శశికాంత్, రాములు, గోవర్ధన్, సుభాష్ పాల్గొన్నారు.

ఘనంగా కొడి పీర్ల పండుగ



చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లిలో కొడీపీర్ల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులు పీర్లకు దట్టీలు, పూలచాదర్లు, మలీదా సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పీర్లను గ్రామంలో ఊరేగింపు చేశారు. వివిధ గ్రామాల నుంచి ఆడపడుచులు గ్రామానికి రావడంతో పండుగ వాతావరణం నెలకొంది.

ఆశా కార్యకర్తలు, కార్మికుల ముందస్తు అరెస్ట్

మహబూబ్‌నగర్ క్రైం: ఆశాకార్యకర్తల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్‌లో భాగంగా చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న 53మందిని, 15మంది మున్సిపల్ కార్మికులు, పెన్షనర్లను ముందుస్తుగా అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ తెలిపారు. మొత్తం రెండు కేసులు నమోదు చేయడం జరిగిందని, ఆ తర్వాత వ్యక్తిగత పూచికత్తుతో వదిలిపెట్టినట్లు చెప్పారు.

చిన్నచింతకుంట: పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికై హైదరాబాద్ వెళ్తున్న కార్మికులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కుర్మన్న మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు.

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మంగళవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల పరిధిలో 'సఫాయి అప్నా.. బీమారి భగావో' కార్యక్రమం చేపట్టారు. ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలంటూ వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అలాగే ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వ ఉన్న సంప్‌లు, డ్రమ్ములను పరిశీలించారు. ఎవరూ డెంగీ, మలేరియా, విషజ్వరాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు యాదయ్య అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.2.96 లక్షల కోట్ల బడ్జెట్‌లో జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు కేవలం రూ.9,200 కోట్లు కేటాయించడం సిగ్గు చేటన్నారు. బీసీల జనాభా దమాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, అలాగే 42 శాతానికి బీసీల రిజర్వేషన్ పెంచి స్థానిక సంస్థల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, పార్లమెంట్ అధికార ప్రతినిధి శ్రీనివాసులు, అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, నాయకులు రాజేందర్‌రెడ్డి, యాదగిరి, సుబ్రమణ్యం, రాజేష్, కమలేకర్, రమేష్, శ్యాం, మహేష్, నాగరాజు, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

నవాబుపేట: మండలంలోని మల్కాపూర్‌తండాకు చెందిన వివాహిత అదృశ్యం కావటంతో భర్త మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మల్కాపూర్ పంచాయతీ పరిధిలోని గుమ్మలమ్మకుచ్చతండాకు చెందిన పాత్లవత్ సునీత సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చిన్న కూతురును వదిలేసి చెప్పపెట్టకుండా వెళ్లిపోయింది. ఎంతకీ తన తల్లి రాకపోవటంతో కూతురు తన నానమ్మకు చెప్పి తండ్రికి సమాచారం అందించింది. దీంతో అందరూ కలిసి చుట్టుపక్కన, బంధువుల చెంత వెతికినా ఫలితం లేకపోవటంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు భర్త పవన్‌కుమార్ తెలిపారు.



జిల్లా కేంద్రంలో బోనాల ఉత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు



హన్వాడలో పోతురాజుల విన్యాసాలు



కేతిరెడ్డిపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వైభవంగా బోనాల వేడుకలు



మహబూబ్‌నగర్ పోచమ్మ ఆలయం వద్ద బారులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. కొత్తగంజి, రాజేంద్రనగర్ తోపాటు వివిధ కాలనీల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో చేశారు. మహిళలు ఊరేగింపుగా బోనాలను పోచమ్మ దేవాలయాలకు తీసుకొచ్చి అనంతరం అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆషాఢ మాస చివరి మంగళవారం కావడంతో స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 1, 4, 8, 9, 13, 17, 27, 46వ వార్డులలో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆయా చోట్ల సాయంత్రం నుంచి రాత్రి వరకు మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో పోశమ్మ, మైసమ్మ ఆలయాల వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు.

రాజాపూర్: మండలంలోని తిర్మలాపూర్, బాలానగర్ మండలంలోని కేతిరెడ్డిపల్లిలో మంగళవారం పోశమ్మ బోనాల పండుగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుందరంగా తయారు చేసిన బోనాలతో మహిళలు పురవీధులలో ఊరేగింపుగా వెళ్లిన అనంతరం అమ్మవారికి బోనం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు.

హన్వాడ: మండల కేంద్రంలోని పురవీధులగుండా మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. ఒక్కో వీధి నుంచి మహిళలు అధిక సంఖ్యలో బోనాలతో తరలి స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం ప్రాంగణానికి చేరుకున్నారు. ఇలా ఒక్కోవీధి నుంచి బోనాలతో తరలివచ్చిన మహిళలు ఊరంతా ఒక్కసారిగా గ్రామశివారులోని పోచమ్మ ఆలయానికి ర్యాలీగా తరలివెళ్లారు. పోతురాజుల విన్యాసాలు, డోలు చప్పుళ్ల మధ్య కదిలారు. శివారులోని పోచమ్మ ఆలయానికి చేరుకుని నైవేద్యాలు, కోడిపుంజులు, కల్లుసాకతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

నవాబుపేట: పోచమ్మతల్లి చల్లగా చూడాలమ్మ అంటూ గ్రామ దేవతలకు ప్రజలు బోనాలు సమర్పించుకున్నారు. మంగళవారం మండలంలోని కూచూర్, కారుకొండలో మైసమ్మ, లక్ష్మమ్మ, ఎల్లమ్మ గ్రామదేవతల బోనాలు ఘనంగా జరిగాయి.



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పాలకొండలో..



హన్వాడలో బోనాలతో ఆలయానికి తరలివెళ్తున్న మహిళలు



మహబూబ్‌నగర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు

జరిమానా చెల్లించిన పశువుల యజమానులు



శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డికి జరిమానా చెల్లిస్తున్న పశువుల యజమానులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్లపై సంచరిస్తున్న 47 పశువులను ఈనెల 29వ తేదీన మున్సిపల్ సిబ్బంది పట్టుకుని టీచర్స్‌కాలనీలోని చిల్డ్రన్స్ పార్కులో ఉంచారు. వాస్తవానికి వీటి యజమానులకు కొన్ని రోజుల క్రితమే నోటీసులు అందజేశారు. చివరకు మంగళవారం స్పందించిన ఆరుగురు యజమానులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డికి రూ.12 వేలు జరిమానా చెల్లించారు. అనంతరం 38 పశువులను తీసుకెళ్లగా, తిరిగి రోడ్లపైకి వదలొద్దని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. మరోసారి బయటకు అలాగే పంపితే భారీ జరిమానా విధించడమే గాక పశువులను గోశాలకు శాశ్వతంగా తరలిస్తామని హెచ్చరించారు. మిగిలిన వాటికీ జరిమానా చెల్లించి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వజ్ర కుమార్‌రెడ్డి, మున్సిపల్ జవాన్ సిరాజొద్దీన్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో ఆపన్నహస్తం



అడ్డాకుల: మండలంలోని రాచాల చెందిన బొక్క బుచ్చన్న అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని చికిత్స పొందుతున్నాడు. బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2.50లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. మంగవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తన నివాసంలో బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా నిరుపేదల వైద్యానికి ఆపన్నహస్తం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు కృషి చేయాలి



జితేందర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ.జితేందర్‌రెడ్డిని మంగళవారం టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శంషాబాద్ నుంచి అలంపూర్ వరకు 184 కిలోమీటర్ల పరిధిలో ఉందని, ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎక్కువ పరిశ్రమలు తీసుకొచ్చి జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా నేషనల్ డిఫెన్స్ అకాడమీకి సంబంధించిన సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం కృషి చేయాలని విన్నవించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వలేదని, మీస్థాయిలో ప్రాజెక్టుకు నిధులు తీసుకొచ్చి ప్రతి ఎకరానికి నీళ్లు పారించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విన్నవించారు.

హన్వాడలో భారీ వర్షం



హన్వాడ: మండల కేంద్రంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు నిరంతరాయంగా కురిసింది. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు కేవలం ముసురు వర్షాలు, చిరుజల్లులతోనే సరిపెట్టిన వరుణదేవుడు బోనాల పండగ రోజే కురవడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ ఆపాలని ఫిర్యాదు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

గండేడ్: తన పేర ఉన్న పట్టా భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు యత్నిస్తున్నారని దీనిని ఆపాలంటూ బాధితుడు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. మండలంలోని పెద్దవార్వాల్ శివారులో 175 సర్వే నంబరులో 3.39 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి వెన్నాచేడ్ చెందిన దొడ్డె చెన్నయ్య పేరుపై ఉంది. కొందరు తనకు తెలియకుండా తన ఆధార్ కార్డు వ్యవసాయశాఖ అధికారుల వద్ద తీసుకుని ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్నారని బాధితుడు తెలిపారు. మమ్మల్ని బెదిరించి కిడ్నాప్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకునే పరిస్థితి నెలకొందని చెప్పారు. దీన్ని ఆపాలని మంగళవారం తహసీల్దార్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. అంతకుముందు తమకు న్యాయం చేయాలని కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దీనిపై మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

ముస్కాన్ బృందం తనిఖీ

జడ్చర్ల: పట్టణంలో ముస్కాన్ బృందం మంగళవారం తనిఖీ చేపట్టింది. బాల బాలికలచే పనులు చేయిస్తున్న వారిని గుర్తించింది. హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని పలు దుకాణాల్లో పనులు చేస్తున్న నలుగురు బాల కార్మికులను అదుపులోకి తీసుకుని జిల్లా కేంద్రంలోని శిశు విహార్‌కు తరలించారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలకు పంపించేలా చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

రుణమాఫీతో రైతులకు మేలు



ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షిస్తున్న పెద్దవార్వాల్ గ్రామస్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తుండడం చరిత్రలో నిలిచిపోతుందని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. రైతుల రూ.లక్షన్నర రుణమాఫీ చేసినందుకు మంగళవారం మండలంలోని దివిటిపల్లిలో సంబరాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

రాజాపూర్: ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని కాంగ్రెస్ నాయకుడు నరహరి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ భాగంగా రూ.లక్షన్నర వరకు మాఫీ చేయడం తో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులకు కనువిప్పు కలగాలన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రమణ, విక్రం తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: మాట తప్పనిది.. మడమ తిప్పనిది కాంగ్రెస్ ప్రభుత్వం అని టీపీసీసీ మెంబర్ నరసింహరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెద్దవార్వాల్‌లో రెండో విడత రుణమాఫీ సందర్భంగా రైతువేదికలో ముఖ్యమంత్రి ప్రసంగం వీక్షించారు. కార్యక్రమంలో ఏఈఓ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, బాలస్వామి, వీరన్న, బంటురాములు, కిష్టయ్య, అనంతయ్య, చిన్న మొగులయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఉమ్మడి గండేడ్ మండలంలో 1,945 మందికి రుణమాఫీ

ఉమ్మడి గండేడ్ మండలంలో 1,945 మందికి రుణమాఫీ అయ్యింది. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో కలిపి 49 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మొదటి విడత పోను రెండో విడతలో రైతులకు రుణమాఫీ అయ్యింది. గండేడ్ మండలంలో 895 మంది రైతులకు గాను రూ.9.32 కోట్లు, మహమ్మదాబాద్ మండలానికి 1,050 మంది రైతులకు గాను రూ.11.41 కోట్లు రుణమాఫీ అయ్యింది. మండలంలోని వెన్నాచేడ్‌లో బుధవారం రైతు రుణమాఫీ సంబరాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి తెలిపారు.

అండర్ పాస్ నిర్మాణ స్థలాన్ని మార్చండి



ఎన్‌హెచ్ఏఐ పీడీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేటలో 44వ నంబర్ జాతీయ రహదారిపై మంజూరైన అండర్ పాస్ నిర్మించే స్థలాన్ని మార్చాలని గ్రామస్తులు మంగళవారం మహబూబ్‌నగర్‌లో ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం 104.305 వద్ద అండర్ పాస్ నిర్మించాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని, అక్కడ కాకుండా దానికి కొంత దూరంలో 104.120 వద్ద నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజలందరికీ అనువుగా ఉన్న చోట అండర్ పాస్ నిర్మిస్తే బాగుంటుందని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలన చేసిన తర్వాత తగిన నిర్ణయం తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఇటీవల అండర్ పాస్ నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు గ్రామంలోని రహదారి వద్ద కొలతలు తీసుకుంటున్న సందర్భంలో విషయం తెలిసిన గ్రామస్తులు అధికారులను కలిశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, పెంటయ్య యాదవ్ తదితరులు ఉన్నారు.

ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్ విజయేందిరకు వినతిపత్రం అందజేస్తున్న ముంపు గ్రామాల నిర్వాసితులు

జడ్చర్ల: ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న వల్లూరు, ఉదండాపూర్ గ్రామాలతో పాటు తండాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని నిర్వాసితులు మంగళవారం కలెక్టర్ విజయేందిరకు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాలకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి ప్రమాదాల బారినపడుతున్నామని వాపోయారు. కనీసం రోగులు సకాలంలో ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రిజర్వాయర్ నిర్మాణ పనులకు భారీ సంఖ్యలో టిప్పర్ల ద్వారా నల్లమట్టిని తరలించడం వల్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిందన్నారు. వెంటనే తమకు బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు.

బాదేపల్లిలో అండర్ బ్రిడ్జి పరిశీలన

జడ్చర్ల: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో అండర్ బ్రిడ్జి పనులను మంగళవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ రాజయ్యతో పాటు పాలకమండలి సభ్యులు పరిశీలించారు. బ్రిడ్జి పనుల్లో భాగంగా గాంధీచౌరస్తాలో ఉన్న గాంధీవిగ్రహాన్ని పక్కకు మారిస్తే బాగుంటుందని, లేదంటే రోడ్డు ఇరుకుగా, ప్రమాదభరితంగా మారే పరిస్థితి ఉందన్నారు. పాతబస్టాండ్ రోడ్డును అనుసరించి గాంధీ చౌరస్తాలో ఉన్న వీధిదుకాణాలను తొలగించాల్సిన విషయం పరిశీలించాలన్నారు. కొన్నేళ్లుగా తాము డబ్బాలు వేసుకుని జీవనోపాధి పొందుతున్నామని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి సముచితమైన నిర్ణయం తీసుకుంటామన్నారు. పనులను ఆగస్టు నెలాఖరు వరకు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నందకిశోర్‌గౌడ్, ఉమాశంకర్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోనుసూద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సినీ నటుడు సోనుసూద్ జన్మదినం సందర్భంగా మంగళవారం పట్టణంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోనుసూద్ ఫౌండేషన్ అధ్యక్షుడు బుద్దారం శివ మాట్లాడుతూ ఎన్నో సినిమాలో విలన్ పాత్రలు నటిస్తూ నిజ జీవితంలో ఎంతో మంది పేదలకు సాయం చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఎంతోమంది పిల్లలకు అండగా ఉంటూ.. హీరోగా వారందరి గుండెల్లో దేవుడిలా కొలిచే మహోనీయుడు సోనుసూద్ అని అన్నారు. తాను అనుకున్న దానికంటే యువత ముందుకు వచ్చి ఎక్కువ రక్తదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కిశోర్‌గౌడ్, మనోహర్, నానియాదవ్, విజయ్ కుమార్‌రెడ్డి, పుట్ట చెన్నయ్య, ముబారక్, నవీన్, చింటు, నాగరాజు, అర్జున్ పాల్గొన్నారు.

పీయూలో ఘనంగా సినారె జయంతి



సినారె చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో సి.నారాయణరెడ్డి జయంతిని తెలుగు డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యాపకురాలు సంధ్యారాణి మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి తెలుగు సాహితి ప్రపంచంలో ఒక వెలుగు వెలిగారని, ఆయన నేటితరం రచయితలకు ఆదర్శ ప్రాయుడన్నారు. రవీందర్, రఘు, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



ర్యాలీలో మాట్లాడుతున్న సీఐ ఆదిరెడ్డి

జడ్చర్ల టౌన్: మెరుగైన సమాజంకోసం ప్రతి ఒక్కరు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ ఆదిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గోనయో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేతాజి చౌరస్తా నుంచి క్రాస్‌రోడ్డు వరకు నిర్వహించిన యాంటి నార్కోటిక్ డ్రగ్స్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు, యువత తాత్కాలిక ఆనందం కోసం వెంపర్లాడరాదని, నైతిక విలువలు పెంపొందించుకోవాలని సూచించారు. కుటుంబంలో ప్రతి ఒక్కరు బాధ్యతతో మత్తు పదార్థాలను దూరం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రశాంత్‌చారి, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై ప్రయాణికులకు అవగాహన

మహబూబ్‌నగర్ రూరల్: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో మహిళా, శిశు, సంక్షేమ శాఖ, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో జిల్లాకేంద్రంలోని రైల్వే ప్రయాణికులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అక్రమ రవాణాలో ముఖ్యంగా పిల్లలు, మహిళలు ఎక్కువగా ఉంటారని, అలా ఎవరినైనా గుర్తిస్తే సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సిబ్బంది, జేజేబీ గిరిజ, బీఆర్‌బీ కోఆర్డినేటర్ వెంకటమ్మ, మహిళా సాధికార కేంద్రం కోఆర్డినేటర్ అరుణ రష్మిత, సఖి అడ్మిన్ సౌజన్య, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కోఆర్డినేటర్ విశ్వకాంత తదితరులు పాల్గొన్నారు.